


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మార్చి 2015

సంపుటి : 21 243 సంచిక : 3




# బ్రతుకు! బ్రతుకనివ్వు! బ్రతుకుటకు భరోసా నివ్వు!

రాజనీతి ధర్మనిరతికి అనుగుణంగా ఉండాలని భారత ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు శాసించినట్లుగా బోధించాయ్. హిందూధార్మిక, ఆధ్యాత్మిక శాస్త్రాలు నూటికీ నూరుపాళ్ళు పాటింపచేసేట్టుగ చిన్న చిన్న నీతి శతకాలుగా ఉద్భోధించాయ్. సత్యం ప్రధానం, శాంతి ప్రధానం, అహింస ప్రధానం.

చెడు వినకు, చెడు అనకు, చెడు కనకు అన్న మూడు మాటలూ, ధర్మశాస్త్రసారాంశం నిగూడమైన ఉపనిషత్పురాణాలూ వీటినే చెప్పాయ్.

**ధరణి ధేనువు, బితుకంగదలచితేని**
**జనులబోషింపుమధిపవత్సములమాడ్కి**
**జనులు పోషింపబడుచుండ జగతి కల్ప**
**లత తెఅంగున సకల ఫలంబులొసగు.**

భువి అను గోవు నుండి సంపదను పిండుకోవాలన్న అభిలాష కలవాడవైతే గోవు తన దూడను వాత్సల్యముతో యెలా పెంచుతున్నదో, అలాటి వాత్సల్యముతోనే పోషించాలయా! రాజోత్తమా- అన్నాడు భర్తృహరి నీతిశ్లోకాన్ని ఆంధ్రీకరించిన ఏనుగు లక్ష్మణ కవీంద్రులు. భువి గోవు వంటిది; జనులు గోవత్సములు.

జనులను చక్కగా పాలించే (పోషించే) బాధ్యతను తీసుకుంటే జగత్తు మొత్తం కల్పవృక్షము కొమ్మలుగా విస్తరించి ఫలాల్నిస్తుంది. భువి పంటలతో, గోపశుసంపద పాడి సౌభాగ్యమిస్తూ సుఖైశ్వర్యాలను చేగూరుస్తుంది.

వేమనపద్యాలు, భర్తృహరి సుభాషితాలు, సుమతీ శతకం జనుల నైతికత నుద్దీపింపచేసే సదోక్తులను చెప్పినవి. ప్రాథమిక విద్యలోనే విద్యార్థి పరిణితి చెందే వాడు. అయితే భారత విద్యావిధానం, విజ్ఞానాత్మక జీవనం, భారత సిరిసంపదలూ, భారతపాలనమూ యెలా భ్రష్టు పట్టించినదీ వివరంగా ఒక్క పద్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు వివరిస్తూ- **'భరతఖండంబు చక్కని పాడియావు, లేగదూడలై హిందువులేడ్చు చుండ, పితుకుచున్నారు మూతులు బిగయగట్టి, తెల్లవారనుగడుసరి గొల్లవారు'-** అన్నారు.

ఏనుగు లక్ష్మణకవి- మన తీరు తెన్నులను రాజులనుద్దేశించి చెబితే, చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు తెల్లదొరలను వేలెత్తిచూపినదీ - జనుల పరిస్థితిలో అప్పటికీ, ఇప్పటికీ యిలాగే ఉన్నది.

ఆ అప్పటి కాలం మూడు శతాబ్దాల కాలం నాటిది- తెల్లదొరలొక్కరేకాకుండా, ముస్లిము దొరలు కూడా మనల్ని దోచుకున్నారు. మన విజ్ఞానం, మన సుజ్ఞానం, సంస్కృతినీ, సంపదల్నీ సహితమూ దోచుకున్నారు. మనల్ని వారి వారి మతస్తులుగా మలుచుకున్నారు. ఇప్పుడెరిగిన భారతీయ చరిత్ర చరిత్ర కాదు; సంస్కృతి మన సంస్కృతి కాదు; వారసత్వ సాంప్రదాయం మనది కాదు. ఈ చొక్కా మనది కాదు. ఈ పంట్లాము మనది కాదు, మనం ధరించే ఆహార్యమేది మనది కాదు. ఆహారం కూడా తీరు తెన్నులు మనవి కావు.

బ్రతకాలి కాబట్టి బ్రతుకుతున్నాం. బ్రతుకు వెళ్ళబుచ్చాలి కాబట్టి తింటున్నాం. నగ్నంగా తిరగకూడదు కాబట్టి నవీనదుస్తుల్ని ధరిస్తున్నాం.

పోనీ కోటికి ఏ ఒక్కరైనా సనాతన పథమెన్నుకుని యోగ్యతా ధోరణిలో మసిలితే ఉర్విజనులు పరమయోగీశ్వరుని జూచి తెగడువారెగాని తెలియలేరు- అమృతాది రుచులు హస్తమేమెరుగును'-అన్న వేమన పద్యం ప్రకారం చేతికి పదార్ధరుచేంవి తెలుస్తుంది. అందుకే ప్రతీ కళాకారుడూ, రాజకీయ వేత్త- చేయిని పైకెత్తి సంకేతంగా- ముందే చేతులెత్తేసి చూపిస్తున్నారు, మా చేతుల్నీ చేతల్నీ నమ్మకండి సుమా - అర్ధమేమో!

'నియమించి సంగుడై నిలిచిన తత్వంబు తామసంబగు నిద్ర తొలగచేయు, నిద్ర తొలంగిన నిర్భీతి నొందించు శమమున ఆనంద సమితిపుట్టు, ఆనందమున విశ్వమంతుడు. తానగు, తాను విశ్వంబైన తత్వమగును-రాజయోగీంద్రుడాతడై తేజంబు'- అని వేమన చెప్పిన తత్వము సత్యకాలములోనిది కావున నిత్యమగునా- అను సంశయం కూడా కలుగుతున్నది. అయితే మహా యోగపురుషులకూ యుగ పురుషులకూ జన్మనిచ్చిన భువికదా- ఇదే తలంపు కలిగిన ఇతర దేశాధినేత లుండినపుడు- ఈ పవిత్ర గడ్డనందు ఒక్కడైనా నీతిమంతుడైన పాలక నరేంద్రుడు పుట్టడా- అని మరో వంక మనసుల్లి తుళ్ళిపడుతూన్నది.

సర్వభూమి భూమి పుత్రులను పెల్లగించి విసరంగచేతును- అనే నేతలున్నప్పుడు సామాన్యుడేంవి చేయగలడు.

శ్రీః। శ్రేయస్సు। శోభ। సర్వజన హితైషం।సౌకుమార్యం। ప్రియత్వం। ధైర్యం। స్థైర్యం। శౌర్యం। ధనుక్షమ। లాలిత్యం। ర్విద్యాప్రవీణం- వేద విద్వత్వం। సత్యభాషణం। సత్శీలం- ఇలా ఇలా తలంలో ఇష్టైక ధర్మగుణాలూ మూర్తీభవించిన హిందూ ధర్మం ఎండగట్టబడుతూందే. పాకిస్థాన్ విడిపోయి వెళ్ళిన తరువాత శేషించినది హిందూస్థానమే! హిందూస్థానములో హిందువులకూ హిందూ ధర్మముకూ స్థానం లేవనుకోవడం - ఆ ధర్మమెక్కడ ఉనికిని గొంటుందనుకోవడం తెలివిహీనం.


గ్రద్ద నింగిలో యెత్తుకు ఎగురుతూ అంతరిక్షస్థాయిలో విహరిస్తూ నేలపై కుళ్ళిన కళేబరాలు కనబడగానే నేలకు వ్రాలిపోతుంది.

ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికినీ హిందూదేశంలో ఉంటూ హిందూ విశ్వాసం లేని మనుషులుండడం, గాంధీ వారసులనుకోవడం జాతికి కళంకం. సనాతన ధర్మ విశ్వాసం లేని మనిషి ఎంత ఉన్నత స్థితిలోకి వెళ్ళినప్పటికినీ కాఫీర్ణమనే ఒక్క గుణంతో క్రిందపడిపోతాడు; నుసియవుతాడు!

హైందవంలో ఉదారత ఉండడం వల్లనే ఇందరు అన్యమతాల వారు స్వేచ్ఛగా ఉండకలుగుతున్నారు. ఓటుహక్కు కలిగి ఉన్నత స్థానములు పొందకలుగుతున్నారు.

బ్రతుకు! బ్రతుకనివ్వు! బ్రతుకుభరోసాయివ్వు! నీలానే వారిని బ్రతుక నివ్వు! నీవు అనుభవించే సుఖాలనే వారి ననుభవించనివ్వు- అన్నది హైందవ సిద్ధాంతం. అట్టి ఔదార్య గుణ సంపత్తిగల హిందూత్వాన్ని 'కాషాయం'గా నిందించడమొక అపరాధం - కొందరు దేశాన్ని హిందూదేశంగా చేసేట్టున్నారని ఆరోపణం చేయడం దారుణాతి దారుణం! ఉదార క్షమ గుణములను తేలిక చేయవద్దు. సమానంగా బ్రతుకు! సమసమాజాన్ని రూపొందించు! సమవర్త (సౌమ్య) నంతో బ్రతుకు।

రాజకీయుల్లారా! మీ రాజకీయాలను జనుల బ్రతుకీయంలో చొరబడనీయకండి! **సారే జహాన్ అచ్ఛా! హిందూస్థాన్ హమారా!**



బుధజన విధేయుడు

***- గోటేటి శ్రీరామారావు***


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# మన్మధనామ సం॥ము పరుగు పరుగున వస్తుంది!

**2015** సం॥ము మార్చి నెల 21వ తేదీ శనివారం ఉదయం 11–35 గం॥లకు ఉగాది వస్తున్నప్పటికినీ మనం ప్రభాతమనే లేచి, శ్రీ వేంకటేశ్వరస్వామినీ, ఆంజనేయ స్వామినీ (వారిరువురికీ ప్రీతికరమైన రోజు) మనఃపూర్వకవందనమాచరిస్తూ, ఉగాది పచ్చడిని తిని, ఫలహారాన్ని సేవిద్దాం. ఉత్తరాభాద్ర నక్షత్రం– పూర్వాభాద్ర నక్షత్రమూ కలిసి ఉండేరోజు.

2015 ఆంగ్లసంవత్సరం ప్రకారం ప్రారంభతేదీ జనవరి 1వ తేదీ గురువారం వచ్చింది. ఆ రోజు ముక్కోటి ఏకాదశి, ముక్కోటి దేవతలూ శ్రీ మహావిష్ణువును దర్శించడానికై, ఉత్తరద్వారంద్వారా వైకుంఠం ప్రవేశించి, వైకుంఠనాధుని దర్శించారు.

వారెవ్వరూ మనకు అందుబాటులేకపోవడంతో తెలుగువారి గిల్లికజ్జాలు తీర్చేవారు లేకుండా పోయారు. గాకపోయినా మనకేంవిటో ఒకటవతేదీ కలిసి రావడం లేదు. నెల పూర్తయిన తరువాత నెల ప్రారంభం 1వ తేదీతోనే జరగాలి. ఉగాది వెళ్ళిన వత్సరానికే ఉగాది రావాలి. కాకపోతే కాల క్రమం తప్పుతుంది.



**మ**నం పుట్టిన రోజు జరుపుకుంటున్నట్లే సంవత్సరమూ పుట్టిన రోజు జరుపుకోవాలి. మార్చి 20వ తేదీకి జయనామ సం॥ము వీడ్కోలు తీసుకుంటూంది. మార్చి 21వ తేదీన క్రొత్త తెలుగు సంవత్సరం 'మన్మధ' వస్తూంది. ఆంగ్ల మాసంలా ఓ నెల 30 రోజులూ, మరో నెల 31 రోజులూ, ఫిబ్రవరి వచ్చేసరికి 28 రోజులూ 29 వ రోజూ రాదు. చైత్రం నుంచి ఫాల్గుణ మాసం వరకూ ఆ తిథులు ఆ పేరులోనే ప్రారంభమై –పూర్ణిమతో గానీ అమావాస్యతోగానీ ఆ పక్షం ముగుస్తుంది.

సృష్ట్యాదినుంచీ ప్రతీ చైత్ర శుద్ధ పాడ్యమికీ కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. యుగాది లగాయతు చైత్రశుద్ధ పాడ్యమిననాడే ఉగాది వస్తూంది. ఏయేటికాయేడు గణిస్తే– ఇప్పుడీ ఉగాదినాడు 'మన్మధ' నామ సం॥ము ప్రారంభమవుతూంది. ఇలా 60 సం॥ముల క్రమంలో 61 సం॥ము వచ్చే ఉగాది 'మన్మధనామ సం॥మవుతుంది. ఇలా 60సం॥ములు పూర్తి కావడాన్ని 'షష్ఠ్యాబ్ది' అంటారు. సంవత్సర క్రమాన్ని షష్ట్యాబ్ది అనరు; 60 సం॥ముల క్రమం పూర్తి చేసుకోవడాన్ని షష్ట్యాబ్ది పూర్తి అంటారు.

కలియుగం ప్రారంభమై ఈ ఉగాదికి 5115 సం॥రాలైనదని జ్యోతిష్యాస్త్రవేత్తలు చెబుతున్నారు. జ్యోతిష్యాన్ని నమ్మవద్దని ఛాందసులు కొందరంటారు. యే తిధివారాలు వచ్చి ముందే యే మార్పులు జరుగుతుందో మన ఖగోళశాస్త్రజ్ఞులు ఖచ్చితంగా



చెబుతున్నారు– ఏయే గ్రహణాలు ఏయేరోజున వస్తాయీ – ఏయే గ్రహణాలు ఏయే రోజున వస్తాయీ – ఏయే సమయాల్లో పట్టు విడుపులుంటాయన్నది కూడా వివరంగా పేర్కొని పంచాంగాలు రూపొందిస్తు న్నారు. మనిషి పరిణామశీలత్వాన్ని చెబుతున్నారు. ముహూర్తాలను పేర్కొంటున్నారు. ఇదంతా వరాహమిరుడు వంటి ఖగోళ శాస్త్రజ్ఞులు పేర్కొన్న శాస్త్రమే! పాశ్యాత్యులు దీనినే తమదైనదిగా చెప్పుకుంటున్నారు.

ఉగాది విషయానికి వద్దాం. ఖగోళ శాస్త్రజ్ఞుల లెఖ్ఖల ప్రకారం– వాళ్ళ గణించి గుణించిన ప్రకారం 5 015 సంవత్సరాలయింది. ఇంకా 42,6,885 సం॥ములు కాలం సంతోష, ధీమాలీనుతూ ప్రకృతి ధోకాలేకుండా ఉంటుంది. ఎందరో జ్యోతిష్కులు 2012 సంవత్సరంతో కలియుగాంతమవుతుందని జనుల్ని బాధాతప్తుల్ని చేసారు. ఈ కలియుగానికింకా 432 కోట్ల సంవత్సరాల ఆయుష్షున్నది. కొన్ని ప్రాంతాల్ను సాగరం తనలో కలుపుకోవచ్చు కొన్ని ప్రాంతాలను తననుండీ బయట పడవేయవచ్చు. కలియుగానికే!ముప్పులేదు.

**చైత్ర మాపి జగద్బ్రహ్మా ససర్వప్రథమేహాని**
**ప్రవర్తయామానతథాకాలస్యగణనామపిః**
**గ్రహాన్నగాన్నృహుతూన్మాసాన్వత్మరాన్వత్యరాధిపాన్**

చైత్రమాస శుద్ధ పాడ్యమి నుంచీ గ్రహాలు నక్షత్రాలు, ఋతువులు, మాసాలు, వారాధిపులన్నీ ప్రవర్తింపచేసే దినం ఉగాది అన్నారు.


ఎండిపోయిన చెట్లుకొమ్మలు చిగురిస్తాయ్. వాగులు ప్రవహిస్తాయ్. మంచినీటి సరఫరా పెరుగుతుంది. పూత పూసిన మామిడి చెట్టుకు పిందెలు, కాయలు కాస్తాయ్.

అయితే బ్రహ్మంగారు కాలజ్ఞానంలో నీటిలో దీపాలు వెలుగుతాయన్నారు. (అది విద్యుత్చ్ఛక్తి) నీరును పొట్లాలుగా కట్టి విక్రయించే రోజులు వస్తాయన్నారు. ఇప్పుడందరూ నీటిని కొనుక్కుంటున్నారు. మినరల్ వాటర్ పేరున సీసానీళ్ళు ఇరవై రూపాయలకు పైగా అమ్ముతున్నారు. పాలు పెరుగులు కూడా సంచుల్లోనే వస్తాయన్నారు. మంచి చెప్పినవి జరుగకపోవచ్చు. చెడు తప్పక జరుగుతుందనేది జగత్సత్యం.

ప్రకృతిలో కల్లోలాలేర్పడుతున్నాయ్. కలహాలేర్పడుతున్నాయ్. వికృత నామ సంవత్సరం వచ్చినపట్నుంచీ నాయకుల్లో, ప్రజల్లో అనేక వికృతమార్పులొచ్చాయ్. భారత పార్లమెంటులో తన్నుకొన్నారు. తొలి రాష్ట్రం రెండుగా విడిపోయింది. ప్రకృతి వికృతిగా, వికృతి ప్రకృతిగా మారింది. వాతావరణ సమతుల్యత మారిపోయింది. పెద్దలపై పిన్నలకు గౌరవం లేదు. దేశభక్తి మృగ్యమైంది. పంటపొలాలు చేపల, రొయ్యల చెరువులై – ఇప్పుడు జనవాసాలయిపోతున్నాయ్. శిశు హత్యలు పెరిగాయ్. పుట్టిన ఆడపిల్లల్ను పుట్టినట్లే పరిమారుస్తున్నారు. కన్న తల్లితండ్రులే యీ ఘాతుకం

(తరువాయి 5 పేజీలో)

# శ్రీ శృంగేరీ శారదా పీఠాధిపతులు
# శ్రీశ్రీశ్రీ భారతీతీర్థమహాస్వామి చరణుల ఉపదేశం!
# మన మాటలు స్వచ్ఛంగా, కల్మషరహితంగా ఉండాలి!!



శాస్త్రాలు మనకు అతి సాధారణమైన విషయాలను కూడ బోధిస్తాయి. అతి సాధారణమంటే మన విశ్లేషణాధోరణి పట్టించుకోని విషయాలు. అవి చాలా సామాన్యంగా కనిపిస్తాయి. వాటి గురించి మన తొందరలో మనం ఒక్కోసారి పట్టించుకోం.

ఉదాహరణకు మనిషికి కోపం వస్తే లేదా బాధాకరమైన విషయం జరిగితే ఇతరులను నిందించడం సామాన్యంగా చేసే పని. ఒక్కొక్కసారి ఇతరులను పరుషవాక్యాలతో నిందిస్తాడు. కొంత సమయం గడిచిన తర్వాత, కోపం తగ్గిన తర్వాత, తాను అలా పరుషవాక్యాలను వాడకుండ ఉండవలసిందనీ, తన కోపం అనవసరమనీ భావిస్తాడు.

అయితే అంతకు ముందే కోపానికి గురి అయిన వ్యక్తి బాధపడ్తూ దుఃఖంలో మునిగి ఉండవచ్చు. పరుషవాక్యాలు అతని హృదయములో మానని గాయాన్ని ఏర్పరచి ఉండవచ్చు.

**వాక్ సాయకా వదనా న్నిష్పత్తిన్తి**
**యై రాహత శ్శోచ్చతి రాత్ర్యహాని ।**
**పరస్య నామర్మసు తే పతన్తి**
**తాన్ పణ్డితో నావసృజేత్ పరేభ్యః ॥**

అందువలన ఎల్లప్పుడూ మనిషి వాక్శుద్ధిని కలిగి ఉండాలంటాయి శాస్త్రాలు. ఒక బాణం ద్వారా ఏర్పడిన గాయం నెమ్మదిగా మానుతుంది. అరణ్యంలో గొడ్డలితో ఖండించబడిన చెట్టు తిరిగి మొలుస్తుంది. కాని పరుష వాక్యాలతో హృదయానికి తగిలిన గాయం మాత్రం మానదు.

**రోహతే సాయకైర్విద్ధం వనం పరశునా హతమ్।**
**వాచా దురుక్తం బీభత్సం న సంరోహతి వాక్క్షతమ్॥**

ఈ విషయాన్ని గ్రహించి ఇతరులను ఏవిధంగాను హింసించకుండ ఉంటారని మేము సర్వులను ఆశీర్వదిస్తున్నాం. ●

(4వ పేజీ తరువాయి)

తలపెడుతున్నారంటే– ఏమనుకోవాలి. వావివరుసలు లేకుండా మరిచి విశృంఖలంగా కామార్తిని తీర్చుకుంటున్నారు. తరువాత ఆ అభాగ్యజీవాన్ని చంపేస్తున్నారు.


రాత్రిపూటేగాదు, పగటిపూట కూడా ఆడది తిరగలేకపోతుంది. తొంభైయేళ్ళ ముసలిదాన్ని కూడా వొదలకుండా కామదాహం తీర్చుకునే యువతా? దేశాన్ని పాలించే ప్రభువులుగా వస్తారేమో అనుకుంటూంటే– టెర్రరిస్టులవుతున్నారు. హిందూమతాన్ని కాషాయం అంటున్నారు. ఈ యువత ఇలా మారుటకు కారకులు రాజకీయనాయకులు, నీతిరహిత విద్య– తల్లితండ్రులు పిల్లల్ని క్రమశిక్షణతో పెంచకపోవడం.

–మన్మథ నామ సంవత్సరమా, నీవు వస్తున్నావంటే భయంగా ఉంది. నీ బాణం తగిలి నీలకంఠునిలో మోహం కలిగింది. వికృత నామ సంవత్సరం నుంచీ కామార్తులు పెరిగిపోయారు. మన్మథ నామ సంవత్సరంలో మరీ పెరుగుతారేమోనని భయంగా ఉంది. ఇంకా ఇంకా పరిస్థితులు క్షీణిస్తాయా? పచ్చని చెట్లూ పచ్చదనం లేకుండా మంచినీటికి కటకట యేర్పడుతుందా? అంతస్తుల కంతస్తుల భవనాలు ఆకాశహర్మ్యాన్ని చుంబించేట్లు నిర్మింపబడి భూజలం పాతాళం కంటా దిగిపోతుందా? కొండలూ, కోనలూ, వనాలూ నరకబడితే క్రూరమృగాలు జనవాసాలకు చొరబడతాయా? ఇప్పటికే చొరబడ్డాయ్. ఏంచిటీ– ఏడుకొండల వేంకటేశా, శ్రీశైలం మల్లేశా, భద్రాచలరామయ్యా, యాదగిరి నరసింహా, సింహాచలపురవరపు వరాహ నరసింహా, కనకదుర్గమ్మా మీరందరూ ఈ రెండు భాషా రాష్ట్రాల జనాన్నీ, జన జీవనాన్ని కాపాడాలి. మీరందరూ కొండ దిగి రావాలి. కండలు లేని కార్మికుల్నీ, వృత్తుల్లేకుండా చనిపోయేవారినీ, భూమి కల రైతన్నల్నీ, బువ్వనోచని జనుల్నీ కాపాడండి.

మన్మథనామవత్సర ఉగాది వస్తుంది. తెల్లతెరలు ఆకాశమును కప్పకుండా లేవండి. ఆ రోజు శనివారం. శని ప్రత్యూష సమయంలో లేచి ఉగాది చన్నీటిస్నానాలు చేయండి. ఇంట్లోని అమ్మల్ను మడి కట్టుకుని – వేపపూవు, పచ్చి మామిడి, చింతపండు, బెల్లం, ఉప్పు, కారం, అరటిపండు ముక్కలతో ఉగాది పచ్చడి చేయమనండి. దేవుడికి నైవేద్యం పెట్టి– ఇంటిలో వారందరూ తినండి. అతిథులొస్తే వారికీ పెట్టండి. పిండి వంటలు చేసుకోండి. పాయసాన్నం చేసుకోండి. కొత్తబట్టలు కట్టుకోండి. నాగలిపట్టే రైతులైతే ఒక్కసారి పొలానికి వెళ్ళి 'ఒక్కచాలు' దుక్కి దున్ని రండి. పాలెగాళ్ళుంటే కొత్తగుడ్డలు పెట్టండి. ఉదయం గుడికి వెళ్ళకపోతే సాయంత్రం వెళ్ళి అక్కణ్ణుంచి అలా పంచాంగశ్రవణానికి వెళ్ళండి. ఆదాయ వ్యయాలూ రాజపూజ్యావమానాలూ రాశి పూర్వక సంవత్సర ఫలితం– పంచాంగంలోని తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణములైదింటినీ తెలుసుకోండి. కార్యసాధన, అనుకూలత తెలుసుకోండి. పంచాంగ శ్రవణం చేసిన పంతులుగారికి దక్షిణ యివ్వండి, ఆశీస్సులు తీసుకోండి.

క్రితం రోజున ఇల్లు అలికి ముగ్గులు పెట్టండి. గోడలకూ గుమ్మాలకు రంగులేయండి. ద్వారబంధానికి మామిడాకులూ పువ్వులూ కట్టండి. కొత్తబట్టలు కట్టుకుని పెద్దలకు నమస్కారములు పెట్టి దీవెనలు అందుకోండి. కొత్త సంవత్సరం కొత్తకోరికలతో ఇంటిలోని వారందరూ ఆనందం పొందేట్టు చూడండి.

మంచి నాయకులూ, మంచి ఉద్యోగులూ ఉంటే వారికి కావాల్సిన మంచి పనులు చేయండి. ●



# విశ్వయోగి విశ్వంజీ భక్తులు విశ్వమంతటా ఉన్నారు!!
# మార్చి 5 పుట్టినరోజుకందరూ వస్తారు

గుంటూరు క్రిష్ణనగర్‌లో ఉన్న ఆశ్రమభవనం ప్రశాంతంగా ఉంటుంది. ఆయన వచ్చే భక్తులకు విభూతి, కుంకుమబొట్టు పెట్టి, దక్షిణ హస్తమణి కట్టుకు పసుపు తోరం కట్టేసరికి భక్తులు తాము ఆర్తితో చెప్పాలనుకున్న విషయాన్నే మరిచిపోతారు. ఆయన తపోమహిమ అనుకోండి, దత్తాత్రేయ, సాయినాథుల అనుగ్రహమనుకోండి- గుంటూరు శివార్లలో నేషనల్ హైవేనానుకుని 100 ఎకరాల్లో విశ్వనగర్ నిర్మాణం చేసారు. బండరాళ్ళతో ఉండే ఆ బంజరు భూమి, వనపుష్పసౌరభంతో అనేక కాటేజీలతో యాగకుండ హాలుతో, చక్కని ఏ.సి వసతిగల ఆడిటోరియంతో, సకల దేవతా పరివేష్టితమైన ఆ పుణ్యనగరమొక క్షేత్రముగా రూపులు దిద్దుకున్నది.

నందనవనమా, బృందావనమా, ఇంద్రాది దేవతా వాసమైన అమరావతియా- అన్నది చెప్పలేము. ఆ పచ్చదనాలచుక్కగా చక్కగా ఉన్న విశ్వనగరంలో పక్షులనుంచీ గోవుల వరకూ కిలకిల స్వరములతో కిన్నెర గానం వినిపిస్తూంటుంది. వేలమంది వచ్చినా ప్రశాంతగా ఉంటుంది. ముఖ్యఉత్సవాలూ స్వామిజీ పుట్టినరోజు (మార్చి 5వ తేదీ) వేడుకలకు వచ్చిన భక్తులకు రెండు పూటలా దధిక్షీరఘృతమైన ప్రసాదాన్ని (భోజనాన్ని), రాత్రి ఉపాహారాన్నీ పెడతారు.

విశ్వంజీ మహరాజ్‌కు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అసంఖ్యాకమైన అంకిత భక్తులున్నారు. సంవత్సరంలో ఆరు నెలలు ఆమెరికా పర్యటిస్తుంటారు. అమెరికాలోని అన్ని మతాలవారు, అన్ని తెగలవారూ విశ్వంజీ భక్తులే! **GOD IS LOVE** ఆయన సందేశం. ఆ సందేశంలోనే సనాతన ధర్మ ప్రభావాన్ని, గంగా ప్రవాహంలా ప్రవహింపచేస్తున్నారు. విశ్వంజీ సాంప్రదాయం దత్తసాంప్రదాయం. ఆయనకు గురుదత్తాత్రేయవాడేకర్ మంత్రోపదేశం చేసారు. విశ్వంజీ దత్త జయంతిని అమెరికాలో జరపడం అమెరికన్‌వాసులకో పర్వదినమైంది. ఆయన పుట్టిన రోజున **NH-5**లో ఉన్న చినకొండ్రుపాడు (గుంటూరు- నరసరావుపేట మధ్య ఉన్నది) విశ్వనగర్‌లో రెండు, మూడు రోజులు వైభవంగా జరుగుతుంటుంది. అమెరికాలో దత్త జయింతికి వచ్చిన భక్తులు స్వామిజీ జన్మదినోత్సవానికి వస్తారు. చినకొండ్రుపాడు వాసులకిదో ఇంటిపండుగ. అమెరికా పర్యటనం ముగించుకుని కొత్త సంవత్సరం జనవరి 7వ తేదీన చెన్నయ్ వస్తుంటారు. చెన్నయ్ భక్తులను కలుసుకుంటుంటారు. దత్త సాంప్రదాయ సాయి ప్రచారం విశ్వంజీ మార్గం. ●



# హిమవన్నగ శిఖరముల ఎత్తుగల భవనాలతో

## - ఆంధ్రరాజధానీ, ముఖ్యనగరాలు కొన్ని రూపులు దిద్దుకోబోతున్నాయ్! -

ఒక సింగపూరో, ఒక దుబాయో, ఒక న్యూయార్కు నగరమో మనం వెళ్ళవలసిన అవసరం లేకుండానే, సీమాంధ్రలోని కొన్ని నగరాలను దర్శించవచ్చు. మన ప్రభుత్వామాత్యులూ, అధికారులూ అక్కడక్కడ పర్యటించి వచ్చారు. ఎత్తుపల్లాలను సరిచేసి, ఎత్తైన భవనాల్ను కట్టాలనుకుంటున్నారు. అలాగే రహదారులూ వస్తాయనే తెలుస్తూంది. అయితే సింగపూర్‌కూ మనకూ ఉన్న తేడా అక్కడ వ్యవసాయం పూర్. మనకు వ్యసాయం రిచ్. వారికి పంటలు పండవు. మనకు సాలుకు మూడు పంటటు పండుతాయ్. వారికి సర్వమూ కరెంటుతోనే – మనకూ 'రెంటు'తో



లభించవచ్చు.

ప్రభుత్వోద్యోగి నుంచీ సామాన్యుని వరకూ 'రూల్సు' పాటిస్తారు. మనమింకా రోడ్ల ప్రక్కనా, రైల్వే ట్రాక్ల ప్రక్కనా, కాలువలూ, నదులు ప్రక్కనా 'స్టూల్సు'కు వెళ్ళడం మానలేదు.

వారు ఉప్పుతో సమస్తమూ 'మార్టు'ల్లోనే కొనుక్కోవాలి. మనమలా కోనుక్కోవాలంటే రాబడులు షార్టు. ఇప్పటికే కాదు మరెప్పటికీ మనం పంటలను పండించలేం. పంట భూముల్లో భవనాలు కడ్తున్నాం కాబట్టి ఆకాశం వైపు చూస్తూ ఆనందించవచ్చు.

మాకూ మహానగరములున్నవోచ్! మాకూ ఆకాశం అంటే భవనాలే ఉన్నవోచ్ యని సంబరపడవచ్చు,

శ్రీశ్రీ అన్నట్టు : **ఆనందం అర్ణవతైతే అనురాగం అంబరమవుతుంది.**

***నేలపై అందాలు :*** సింగపూర్‌లో అడుగుపెట్టగానే పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షించేవి... రోడ్లు, రైళ్లు, ఎత్తైన భవనాలు. బస్సుల్లో, టాక్సీల్లో, హోటళ్లలో అన్నిచోట్లా ఎయిర్ కండిషన్ సౌకర్యం వుంది. రోడ్లు ఎంతో శుభ్రంగా ఉన్నాయి. ఈ రహదారుల ఒంపు సొంపులకు మురిసిపోయి చూపు తిప్పుకోలేక నిలబడి పోయాయే అన్నట్టుగా వీధిదీపాలు ఉన్నాయి. రోడ్ల అందాలను బంధించేందుకే అన్నట్లు అక్కడక్కడా ఉన్నాయి సెక్యూరిటీ కెమెరాలు. రహదారులపై ఎక్కడా చిన్న కాగితం ముక్క లేదు. అన్నిచోట్లా చెత్తకుండీలు! ముఖ్యమైంది ఇక్కడ ట్రాఫిక్ వ్యవస్థ! చిన్న పిల్లాడు కూడా సులువుగా రోడ్లు దాటెయ్యొచ్చు!





# అప్పటి శ్రవణ సుందరి ఆకాశవాణి! ఇప్పటి దృశ్య బుల్లి తెర మంధర!



ఏఁవి విన్నవింతును! ఎన్నని విన్నవింతును! ఎలా విన్నవింతును! అలనాటి విజయవాడ ఆకాశవాణి శ్రవణసుందరిని!

ఉదయం భక్తి రంజనితో ఆరంభమైన కార్యక్రమాలు ప్రముఖ కవివరేణ్యుడు పింగళి లక్ష్మీకాంతంగారు- ఏ సుముహూ ర్తమున 'భక్తిరంజని' నామకరణం చేసారోగాని- ఆకాశవాణి ప్రారంభంలో ప్రారంభింపబడే 'భక్తిరంజని' ఎంతటి సుశ్రావ్య శ్రవణ రంజని!

ఉదయం లేచీ లేవగానే 'రేడియో- ఆన్' చేయడం, భక్తి రంజని పాటలు శ్రవణం చేయడంతో మనసేదో ఉల్లాసంతో ఉరకలువేసేది. ఆనందంగా దినచర్య ప్రారంభమయేది. మంగళం పల్లి బాలమురళీకృష్ణగారు, శ్రీరంగం గోపాల రత్నంగారు-ఒకరా ఇద్దరా-ఎంద రెందరు మానసమును పండించేవారో! ఇంకో అరగంట ఉంటే ఎంత బాగుండేదో అనుకనేవారమో! బడికి పిల్లల్ని సిద్ధం చేయడం, ఆఫీసులకు వెళ్ళేవారి సరం జామా అంతా సంగీత నేపద్యంలోనే జరిగేది. అలసటా సొలసటా అనిపించేది కాదు. ఏఁవిటీ- అప్పుడే అయిపోయిందా - అనే చికాకు కూడా కలిగేది. చికాకును శ్రీరంగం పంపించి, పరాకును పాశర్లపూడి పంపించి సరిగ్గా ఆఫీసులకు వెళ్ళేవాళ్ళు ఆఫీసుకూ, బడులకూ వెళ్ళే వాళ్ళు బడులకు వెళ్ళేవారు.

బెజవాడ (పూర్వపు విజయవాడ పేరు) ఆకాశవాణి కేంద్రానికే ఇంతటిపేరేఁవిటి- అంటే చాలా జాబితా (లిస్టు) చెప్పాలి. చాలామంది పేర్లు చెప్పాలి! ఎవర్ని మరిచిపోతామేమోనని భయం. ఎవర్ని ముందు వెనుకలు చేసి చెబుతామనే సంశయం. ఒక్కటి మాత్రం చెప్పేతీరాలి:

ఆనాటి కార్యక్రమాలన్నీ సంగీత సాహిత్యములు పూవూ పూవూ గ్రుచ్చి దండవేసినట్లుగా ఉండేవి. వాటికీ సుశ్రవ్య పద్యనాటకాలు వచ్చిన సమయం త్రివేణీ సంగమమే అనుకోండి. అప్పుడవేవీ సినిమా రికార్డింగు పాటలలా ఉండేవి కావు. అన్నవరపు రామస్వామిగారి ఫిడేలు, దండమూడి రాజగోపాలరావుగారి మృదంగమూ ప్రక్క ప్రక్క వాయిద్యాలు. ముఖ్యంగా ప్రారంభంలో సన్నాయి, డోలు వాయిద్యం శ్రవ్య మేలు కోలుగా ఉంటే, రాత్రి హరి కథా ప్రసారం ముక్తాయింపుగా ఉండేది. తప్పకుండా ఓ సంగీత బోధనా కార్యక్రమం ఉండేది. వోలేటి వెంకటేశ్వర్లుగారు చెప్పే సంగీత పాఠాలను జగన్నాథాచార్యులుగారు శిష్యులుగానూ- ఆ తరువాత సూరి బాబుగారు గాత్రధారణ చేసారనుకుంటాను.

ఆదివారం వచ్చేసరికి చిన్నపిల్లల కార్యక్రమం పెద్దలకే కాలక్షేపంగా ఉండేది. ఏడిద కామేశ్వరరావు గారు ఆ కార్యక్రమాన్ని పిల్లల్ని అలరించేట్టు నిర్వహించేవారు. ఆనాడు పిల్లలు ఎంత ఆతురతగా ఎదుచుచూచేవారో, కుటుంబసభ్యులంతగా ఉత్సుకతతో ఎదురు చూసేవారు. చిన్న చిన్న నాటికల్ను కూడా పిల్లలచే ప్రదర్శింపచేసేవారు. ఓ నీతిపరంగా, భక్తిపరంగా మంచి వినోదపర్వంగా ఉండుటవలన నేను కూడా ఆసక్తిగా చూడడమే గాకుండా, అలాటి పిల్లల కార్యక్రమాన్ని, నేనెప్పుడైనా నిర్వహించగలనాయని ఆశను పెంచుకుంటూండేవాణ్ణి. (నా ఆశ, ఆశయంగా రూపొంది- చెన్నయ్ ఆకాశవాణిలో ఆదివారం పిల్లల కార్యక్రమాలు నా స్క్రిప్టుల తోనే నిర్వహించాను. అప్రస్తుతమైనా చెప్పవలసివచ్చింది)

ఆకాశవాణివారు పెద్దల కార్యక్రమాల్ని ఎంత శ్రద్ధగా నిర్వహించేవారు. పిల్లల కార్యక్రమాలనూ అలాగే నిర్వహించేవారు. విచిత్రమేమంటే పెద్దల కార్యక్రమాలను పిల్లలుకూడా వినేవారు. పిల్లల కార్యక్రమాలను పెద్దలు వినేవారు.

ఓ గొప్ప విషయమేమంటే ఆనాడు సీతాపతి సంసారం సీరియల్ 72 వారాలపాటు ప్రసారమైంది. గాడేపల్లి సూర్యనారాయణ, ప్రయాగ నరసింహ శాస్త్రిగారు ఓ వినోదభాషణా కార్యక్రమం 'బావగారి కబుర్లు'ను చమత్కృతంగా నిర్వహించేవారు. ఓసారో రెండుసార్లో ప్రయాగ నరసింహశాస్త్రిగారు మా యింటికి వచ్చారు. పొట్టిగా, ఘట్టిగా కబుర్లు చెప్పేవారు. అచ్చు రేడియో కార్యక్రమంలానే మా బాషణా కార్యక్రమం కొనసాగేది. ఆ రోజులూ, ఆ మిత్రత్వాలూ అలాంటివి. ఆ మనుష్యుల మనస్సులు ***(తరువాయి 9 పేజీలో)***

*ఆకాశవాణి వార్తలు చదువుతున్నది కొంగర జగ్గయ్య - అంటేనూ, ఆకాశవాణి వార్తలు చదువుతున్నది ఏడిద గోపాలరావు అంటేనూ - ఏదో సంగీతం విన్నట్లుగా ఉండేది! భద్రాచలరామయ్య కల్యాణవ్యాఖ్య వింటూంటే- శ్రీరామ కల్యాణం చూస్తున్నట్టు చెవుల దగ్గరకు కోయిల వచ్చి కూసినట్లుండేది.*

*ఆకాశం అలజడిగా ఉన్నా -*

*నీలిమేఘాలు క్రప్పివేసినా -*

*ఎక్కడ ఆకాశవాణి కార్యక్రమాలు వినిపించవేఁమోనన్న ఆందోళనం కలిగేది. మరల ఆ కార్యక్రమం రాదుగా అనే బాధ పొడసూపేది.*

*ఇప్పటి టి.వి. కార్యక్రమాలు ఉరుములు ఉరిమినా జడివానా కురిసినా కార్యక్రమం ఆగిపోదు. ఒకవేళ సీరియల్‌ను ఓరోజు చూడక పోయినా బాధ ఉండదు, మరునాడు కూడా కథ అక్కడే ఉంటుంది. అది కాదని మరో సీరియల్ చూచినా-అలాంటి కథే. ఉమ్మడి కుటుంబంలో చిచ్చు. అబ్బాయో అమ్మాయో ఎవరినో ప్రేమించడం, వాళ్ళని కాదని వెళ్ళిపోవడం లేదా ఆ యింట్లోనే ఉండి సతాయించడం, కృత్రిమం, క్రూరత్వం గల పోలీసులూ- అందులో ఓ దాదా! దాదా చెప్పినట్లు ఆడడం-ఓ అసిస్టెంటు కమీషనరో-అదే స్థాయి అధికారో, మంత్రో, వారితో కుట్రకు అధినేత కావడం - చివరికి ఐ.జి. పోలీసో కమీషనరో- చిత్తశుద్ధిగలవాడుండి వాణ్ణి పదవుల్లోంచి తీసివేయడం- అన్నీ మూస కథలే! ఇలాటివాటికి నాటి ఆకాశవాణి చోటివ్వలేదు.*

*If you want Comfortable Stay - Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114




# ... శ్రీరామ రామ రామేతి మనోరమే ...

'అందరివాడవయా... భద్రాచలరామయ్య' అనే పాటని మరో 'రాముడి' కోసం పాడుకుంటే ఆ రాముడు శ్రీ గోటేటి శ్రీరాముడే. 'అందరి వాడవయా శ్రీ గోటేటి రామయ్యా' అని హాయిగా పాడుకోవచ్చు. రామాయణాన్ని వాల్మీకి రాస్తే అధ్యాత్మ రామాయణాన్ని శ్రీ గోటేటి అతి సుందరంగా, అతిలలితంగా, సర్వజనామోదంగా, సవివరంగా వ్రాసి చక్కని తెలుగులో తెలుగుజాతికి అంకితమిచ్చారు.

వ్యక్తిగా ఎందరు మహానుభావుల్ని కలుసుకున్నారో, జర్నలిస్టుగా ఎందరి హృదయాల్ని అక్షరాలరూపంలో పేర్చారో, ఎందరు సంస్కర్తల్ని ప్రముఖాంధ్రద్వారా వెలికితెచ్చారో, ఎందరి 'ఉన్నతిని' ఒక పత్రికాధిపతిగా లోకానికి చాటి స్ఫూర్తిదాతలుగా నిలబెట్టారో, ఎందరు సద్గురువుల్నీ, నడయాడే కారణజన్ముల్నీ దర్శించి వారి ఆశీస్సులు పొంది, వారి బోధల్ని భక్తిగా, చిత్తశుద్ధితో ప్రముఖాంధ్ర పాఠకులకి అందించారో! ఎన్ని విపత్కర సమయాల్లో తక్షణమే స్పందించడం కాక, ఇతరులు కూడా స్పందించే స్ఫూర్తినీ ఉత్సాహాన్నీ కలిగించారో చెప్పాలంటే ఓ మహాగ్రంథమే అవుతుంది. 82 సంవత్సరాల జీవితం ఓ పుస్తకం అనుకుంటే, అందులోని ప్రతి పుటా మనకు మార్గదర్శనమే... అనుసరణీయమే. 'ఆచరణ'కి నిలువెత్తు నిదర్శనం శ్రీ గోటేటి. చల్లని మాట, చల్లని చూపులతో అందర్నీ ఆశీర్వదించడమేగానీ, కలలోకూడా పల్లెత్తు విమర్శ చేయని తత్వం ఆయనది.

రాముడెక్కడ వుంటే రోమరోమానా రామనామమే నింపుకున్న హనుమంతుడు అక్కడ వుంటాడట. తెలుగు 'సభ' ఎక్కడ జరుగుతుందో అక్కడ మన తెలుగుతల్లినీ, తెనుగు తీపినీ శ్లాఘిస్తూ మైమరచిపోయే మన శ్రీ రామారావుగారు వుంటారు. అందర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ... యోగక్షేమాల్ని ప్రేమతో అడిగి తెలుసుకుంటూ!

ఎందరో శ్రీ గోటేటి శ్రీరామారావుగారిని ఎన్నెన్నో బిరుదులతో, అవార్డులతో, జ్ఞాపికలతో, దుశ్శాలువలతో సత్కరించి తమ సంస్కారాన్నీ విధేయతనీ చాటుకున్నారు. ఈ చెన్నై మహానగరంలో మా లాంటి వారందరికీ మంచీ చెడు వివరించి చెప్పే పెద్ద దిక్కు శ్రీ రామారావుగారే అనడం ముమ్మాటికీ సత్యమే. జర్నలిస్టుగా, పత్రికాధిపతిగా, సమాజ సేవకుడిగా, ఒక ఆదర్శమూర్తిగా, గొప్ప తండ్రిగా, గొప్ప వక్తగా ఓ గొప్ప వినయశీలిగా, 'కొత్త' ని ఆహ్వానించే నిరంతర విద్యార్థిగా, ఆయన ఎంతమందికి మార్గదర్శకులంటే– లెక్కపెట్టడానికి కంప్యూటర్ సహాయం తీసుకోవాల్సి వస్తుంది. అన్ని రంగాలలోనూ ఆయన ఉన్నతమైన ప్రమాణాల్ని నెలకొల్పి, తమ ఉత్తమవ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.



మార్చి 7న వారు 83వ సంవత్సరంలోకీ, ఆగస్టు 2న సహస్ర చంద్రపూర్ణ దర్శన యోగంలోకీ అడుగుపెట్టనున్న శుభసందర్భంలో, వారికీ, వారి కుటుంబమంతటికీ సర్వశుభాలనూ, ఆయురారోగ్య ఐశ్వర్యా ఆనందాలనూ నిరంతరం ప్రసరించాలని ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తూ, అటువంటి మహానుభావుడి సాంగత్యం లభించినందుకు మనస్ఫూర్తిగా ఆనందిస్తూ, వారు నిండునూరేళ్ళు ఆనందంగా ఆప్యాయంగా మనను సదా ఆశీర్వదించాలని కోరుకుంటూ–

**సవినయంగా వారి పాదపద్మాలకు నమస్కరిస్తూ**

**భువనచంద్ర**

***(8వ పేజీ తరువాయి)*** తేనె మనస్సులనే చెప్పాలి. సాహిత్యమన్నా, చమక్కులన్నా, పద్యాలన్నా పరవశించి పోయేవారం. అందుకనువు గానే నా 'మధురవాణి' మాసపత్రిక సినిమా సాహిత్యమూ, నాటకములపైనే దృష్టిపెట్టేది! పి.బి.శ్రీనివాస్ ఎప్పుడు కనిపించినా 'మధురవాణి' గోటేటి వారనేవారు. నాకు పద్యనాటకాలంటే బాగా యిష్టం. పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం, సారంగధర, వరవిక్రయం నాటకాలు ప్రదర్శింప బడేవి. బందా కనకలింగేశ్వరరావు, పీసపాటి నరసింహమూర్తి, ఏ.వి.సుబ్బారావు, షణ్ముఖ ఆంజనేయరాజు, వేమూరి రామయ్య, ఈలపాటి రఘురామయ్య, ధూళిపాళ, అద్దంకి, కందుకూరి చిరంజీవరావు మాధవపెద్దిలాంటి గొప్పగొప్ప స్టేజినటులు పాల్గొనేవారు.

కూచిపూడి నృత్యాన్ని 'ఆకాశవాణి' ద్వారా వెలుగులోనికి తెచ్చినవారు బందా కనకలింగేశ్వరరావుగారనే చెప్పాలి. ఇలా ప్రఖ్యాతికి గొనివచ్చిన వారిలో బాలాంత్రపు రజనీకాంతరావుగారు – ఆయనెన్నో కార్యక్రమాల్ని చేసారు, చేయించారు. బాలాంత్రపు రజనీకాంతరావుగారు ఆకాశవాణిలో చక్కటి కళాసాహితీ నృత్యాభివేశం గల దిట్ట. ఇహ బందా కనకలింగేశ్వరరావుగారు బారిష్టర్ పార్వతీశం, విశ్వనాథవారి 'వేయిపడగలు', హేమాహేమీలచే 'పాండవోద్యోగ' విజయాలను ప్రదర్శింపచేయడం – గొప్ప విశేషం. ఆయన 'ఆకాశవాణి'ని చక్కగా కళా సాహితీ కాణాచిగా రూపుదిద్దే ప్రయత్నం చేసారు. 'ఆకాశవాణి' అనేక కళా వికసిత కార్య క్రమాలను చేయడంలో ఆకాశవాణి డైరెక్టర్‌గా బాలాంత్రపు రజనీ కాంతారావు గారు రూపకల్పన చేసారు.

ఆదివారం వచ్చిందంటే అందరమూ రేడియోకి అతుక్కుపోయేవారం. భక్తి రంజని, పిల్లల కార్యక్రమం, ఓ గంటపాటు సంక్షిప్త చలన (తెలుగు) చిత్రం బావ గారి కబుర్లు – ఇంకాయేవో– నా మనసులో ఇంకిపోయాయి. దువ్వూరి వెంకట రమణ శాస్త్రిగారి జానకితో జనాంతకం–ఇంకా కొన్ని శ్రవణ చిత్రాలు కోకొల్లలు.

శ్రీరామనవమి వచ్చిందంటే చాలు భద్రాచల సీతారాముల కల్యాణ శోభను కళ్ళముందు చిత్రంగా, చెవులూరించేట్టు జమ్మలమడక మాధవరామశర్మగారి గొంతులు నవవాయిద్యములూ మ్రోగినంత సుందరంగా, సంబరం కొల్పుతూ– శ్రవణానందం కూర్చేది. శ్రీరామనవమి పందిళ్ళకు వడపప్పు పానకాలకు వెళ్ళేవాళ్ళం. రేడియో దగ్గరే కట్టకట్టుకునేట్టుండేవారం. అప్పటికింకా ట్రాన్సిస్టర్లు రాలేదు. భద్రాచలం వెళ్ళినా అంత శ్రావ్యంగా కార్యక్రమాన్ని వీక్షించేవారం కాదేమో అనిపించేది. అలాగే ఆదివారం సంక్షిప్తీకరింపబడిన తెలుగు సినిమా– ఓ గంట కాలవ్యవధిలో వినేవాళ్ళం.

అప్పటి ఆకాశవాణి ప్రయోక్తలు – జి.వి.కృష్ణారావు, పాలగుమ్మి విశ్వనాథం వంటివారుండేవారు. 'వాణి' పత్రిక ద్వారా ముందే కార్యక్రమాలను గూర్చి తెలుసుకునేవారం. అది ఆకాశవాణి అధికారపత్రికయైనప్పటికినీ– సాహితీపరంగా సాహితీపిపాసులకు సన్నిహిత స్నేహితునిగా ఉండేది. ఏ౦వి పోయేకాలమో వాణి పత్రికను అప్పుడే నిలిపివేసారు. కార్యక్రమాలను నిలిపివేసారు.

ఆకాశవాణి కార్యక్రమాలను సంగీత, సాహిత్య, నృత్య, నాటకముల వేదికగా రూపొందేట్టు నిర్వహించాలని ఆనాటి భారత ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ మార్గ నిర్దేశం చేసారు. సినిమా నాటకరంగాలు సాంస్కృతిపరంగా ఉన్న కాలంలోనే రేడియో గొప్ప పాత్రను వహించింది. ఇంటికో రేడియో విధిగా ఉండేది. ఇప్పుడేదీ? ●



ఇంటా బయటా ముచ్చటైన జంట రా(ధా)వి కొండలరావు

చిత్రరంగ ప్రస్థాన ద్వయం

# రా(ధా)వి కొండలరావు

**అయిదున్నర దశాబ్దాల అకుంఠిత కృషి! నాటక, సినిమా, పత్రిక, టి.వి. రంగాల ఛలోక్తి సంభాషణా భాషిగా, సుహృద్భాషిగా అన్ని రంగాల్లోనూ సముడు లేడనిపించుకున్న ప్రతిభాశాలి!**

భమిడిపాటి కామేశ్వరరావు, వారి కుమార్డు రాధాకృష్ణా, మొక్కపాటివారూ జంధ్యాల ఆదిగాగల సాహిత్యోస్వాదిహాస్యాన్ని రసవంతంగా పండించారు. కానీ హాస్యాన్ని శ్రుతిమించకుండా, సున్నితాతి సున్నితంగా, నాటిక, నాటకాలు వ్రాసి, తానూ కౌమార, యవ్వన, వృద్ధాప్య పాత్రలను ధరిస్తూ – చతురంగ సామర్థ్య నటునిగా – సముడను వాడు, లేడనిపించి నటించే 'కొండల–రావూ' అనిపించిన ఘనాపాటి. ఎల్వీ ప్రసాద్, తాతినేని ప్రకాశరావు, ఆదుర్తి సుబ్బారావూ, దాసరి నారాయణ రావు గార్ల వద్ద సహాయకులుగా పనిచేసిన, ఎందరెందరో దర్శక శిఖామణులయినట్లుగానే రావికొండలరావు నాటక సమాజంలో పాత్రలు ధరించిన వారెందరూ సినీమా రంగంలో రాణించారు. కొందరు నిర్మాతలూ, దర్శకులయ్యారు.

నటనలో శిక్షణ, క్రమశిక్షణ కలవాడు నాటకరంగంలోనూ రాణించగలడు, జగన్నాటకరంగంలోనూ రాణించగలడు. పెన్సిలుతో చిత్రాన్ని గీసి సిరాతో, సరిదిద్దిన తరువాతనే చిత్రమయినట్లు, చిత్రశిల్పి చిత్రకారుడయినట్లు తనకంటూఒక శైలి యేర్పరచుకుంటాడు శకాన్ని ఏర్పరచుకుంటాడు.



రావికొండలరావు జనజీవనంలోంచి పాత్రలు తీసుకుంటూ – ఆ పాత్రలు మనమధ్య తిరుగుతూ మన కుటుంబాలలో జరుగుతున్నట్లుండే ఇతివృత్తాన్ని మలచుకుని తానే అన్ని పాత్రలను, చిత్రకారుని చిత్రంలా రూపొందించడంతో నాటకమూ రంజిల్లుతుంది, నటుడూ రాణిస్తాడు. ఆ ఇతివృత్తానికి సున్నిత హాస్యం జోడించినట్లయితే – ఉప్మా పెసరట్టులా ఉంటుంది. 1961లోనే ఇప్పటికి ఐదున్నర దశాబ్దాల పూర్వం కొండలరావు ప్రదర్శించి నటించిన నాటకం కొండలరావు ఒక్కనికే కాదు, అందు నటించిన రాజబాబుకు కూడా మంచి రాశినీ, వాసినీ తెచ్చింది.

కొండలరావు గొప్పతనం ఆయన రచనలో ఉందా, నటనలో ఉందా – అని ప్రశ్నించుకుంటే – జవాబు చిక్కడం కష్టం. ఆయన రచనలు, నాటకాలు ప్రదర్శించడానికే కాదు, చదువుకోవడానికి కూడా ఉల్లాసం కూరుస్తాయ్. మానసిక విచారంగా ఉన్న వాళ్లకి కొండలరావు రచనలు కొండంత ఆనందమూ బలమిస్తాయ్.

ఎవరో ద్రాక్షపాకం యెలా వుంటుందని అడిగితే రావికొండలరావు నాటకం చూడండి – అన్నాను.

మనసు చికాకుపరిచే సన్నివేశాలుగాని, గగుర్పాటు పుట్టించే సన్నివేశాలుగాని ఆయన నాటకాల్లోకి చొరబడే సాహసం చేయవు.ఓ సమాన రేఖ గీసినంత తిన్నగా ఉంటాయ్. ఆయన పాత్రల్లో –అంత చక్కటి, చిక్కటి హాస్యం చిందులాడడానికి ఆయన చేసిన మిమిక్రీలుల అనుభవమే కావచ్చు. పూర్వం ఇమిటేషన్ ఆచార్యగారని ఉండేవారు. శివరావు తీసిన 'పరమానందయ్య శిష్యులు' చిత్రంలో – ఓ శిష్యునిగా నటిస్తూ, 'గురువుగారూ–మన గృహం కాలి పోవుచున్నది' అంటూ లాగిలాగి చెప్పేసరికి గురువుగారి గృహం కాలిపోతుంది – అయితే అంత లాగుడుపీకుడులు 'రావి' గారి నాటకాల్లో ఉండవు. ఉరుము ఉరిమినట్లు, చిన్నగా మెరుపుతీగ మెరిసినట్లు – మామూలు సంభాషణల్లోనే ఛమక్కులుంటాయ్. చార్లీ చాప్లిన్ కళ్ళు అభినయించినట్లుంటాయ్. లారల్ హార్డీలు, భగవాన్ (హిందీ) సీతారాం (తెలుగు) కాతాడి రామ్మూర్తి, ఎస్వీ శేఖర్, చో రామస్వామి, టి.ఆర్.రామచంద్రన్ (తమిళం) వంటి పోకడలు ప్రోది చేసుకుంటాయ్. వయసు ఎనిమిది పదులుంటుందేమో గానీ, నటన మాత్రం ఇరువదిలోనే వుంటుంది. రాధామానసోల్లాసం వలె కనులూ, వీనులూకు ఇంపుగూర్చు సొంపు ఇంపుల హాస్యం.

### రాధ-అంటే జ్ఞాపకం

రావికొండలరావు హృదయంలో రాధాకుమారి ప్రవేశించి – అర్థాంగియైంది. నటనే వారిరువుర్నీ కలిపింది. ఎక్కడవారు కనిపించినా చిలుకా గోరింకల్లా ఉండేవారు. వారి అన్యోన్యత, ఆత్మీయతా, పరస్పరానురాగమూ వర్ణించడానికి ఉపమానాలే కొరవడ్డాయ్.

కలిసే నాటకాల్లో నటించారు. కలిమిడైన భార్యాభర్తలా కలిసి జీవించారు.

ఒకసారి వెదురుపాక గాడ్‌గారి జన్మదినోత్సవంలో **(తరువాయి 11వ పేజీలో)**

### రావికొండలరావులోని కొన్ని ప్రధాన ఘట్టాలు :

✦ **1948** సం॥ములో 'బాల' పత్రికకు వెళ్ళి న్యాపతి రాఘవరావు, కామేశ్వరి (రేడియో అన్నయ్య, అక్కయ్యలు) ఆశీస్సులందడం – ఆ కార్యాలయంలోనే పొట్టి లాగులతో వచ్చిన బాపు రమణల పరిచయం.

✦ **1956** సం॥ములో ఆనందవాణి పత్రికలో ఉద్యోగం (ఇది అందరి రచయితలకూ ఆనవాయితీయే!)

✦ **1961** సం॥ములో మద్రాసు చిల్డ్రన్స్ థియేటర్లో నాటక ప్రదర్శనం – రాజ్‌బాబుకు వెలుగుబాట చూపిన నాటకం కావడం.

✦ **1956**లోనే డి.వి.నరసరాజుగారి సిఫార్సుపై పొన్నలూరి బ్రదర్సు చిత్రంతో సినిమారంగ ప్రవేశం.

✦ **1960–70** దశకాల్లో కొడవటిగంటి కుటుంబరావు గారి సూచనతో 'విజయచిత్ర' సినిమా పత్రిక సంపాదకత్వం. అప్పట్నుంచే రావికొండలరావు ప్రస్థానం ప్రారంభమైంది. విజయావారి సినిమాలకు సంభాషణలు వ్రాసారు. చిత్రనిర్వహణ బాధ్యతలు నిర్వహించారు.

# శ్రీరామనవమి జనన వందిత చిదానంద నరసింహుడు
# సకల నరసింహులు శ్రేష్ఠి!! తొంభైవ వయసుకు వస్తున్న పసిడి వయసువాడు!!



శ్రీరాముడి అనుగ్రహం మెండుగా ఉన్నదని చెప్పడానికి నిదర్శనం సకల నరసింహులు శ్రేష్ఠి – తొంభై సంవత్సరాల క్రితం శ్రీరామనవమినాడు జన్మించడం!

బుద్ధిలో బృహస్పతి – గుణవర్ధన విశిష్టతల్లో వశిష్టుడు. దానగుణంలో శిబి చక్రవర్తి, శాస్త్ర పరిజ్ఞానంలో భరద్వాజుడు – ఇలా ఇలా చెప్పాలంటే 24 వన్నెల బంగారు మనసువాడు. ఆయన చేస్తున్న ప్రతిభావంతమైన వ్యాపారం బంగారు జ్యువెలరీ వ్యాపారం.

కాళిదాసు 'కుమార సంభవం'లోని శ్లోకాలను పొల్లుపోకుండా చెబుతూ వ్యాఖ్యానం చేయగల దిట్ట. వైశ్యుల్లో ధర్మపరులెక్కువగా ఉన్నారు. కానీ కావ్య పరిజ్ఞానం కలవారు లేరు. స్వామి చిన్మయానంద ప్రభావం వారిపై ఉన్నది. బ్రాహ్మణ భక్తి ఉన్నది. అనేకానేక ధర్మకార్యాలకు ఇతోధికంగా సహాయపడు గుణసంపద ఉన్నది.

ధనం కలవారెందరో ఉన్నారు; మనం కలవారు తక్కువ ఉన్నారు; దానం చేసేవారెందరో ఉన్నారు; ఒక చేత్తో చేసిన దానం మరో చేతికి తెలియనివారు అరుదు. ఇచ్చినపుడెంతో యిష్టంతో యిచ్చేవారు కొందరే ఉన్నారు. చేసిన మంచి కార్యాలు పదితరాలవారికి భాగ్యభోగ్యాలనిస్తుందని ఉపనిషత్తులే చెప్పాయ్.

నర్సింహులు శ్రేష్ఠి – శ్రీరామనవమినాడు – గ్రహాలన్నీ శుభవీక్షణం కలిగినప్పుడు జన్మించినందుననే శ్రీరామానుగ్రహం సంపూర్ణంగా కలిగింది. శ్రీరాముడు వంటి మర్యాదరాముడు. సౌభాగ్య రాముడు, సౌశీల్యగుణధాముడు.

సంపూర్ణ ఆయురారోగ్యాలతో – చిరునవ్వే శ్రీరామరక్షగా సకల నరసింహులు చెట్టిగారు పూర్ణాయురారోగ్యాలతో పూర్ణాయుష్మంతునిగా వర్ధిల్లాలని ప్రముఖాంధ్ర, గోటేటి శ్రీరామారావూ కోరుకుంటున్నారు; శ్రీరామచంద్రుణ్ణి ప్రార్థిస్తున్నారు. శ్రీరామా! రఘువంశసోమా! రామదోర్బలోద్ధామా రాక్షసవిరామా! రావణ ప్రముఖ రాక్షస పక్ష బేధ సుత్రామా! జగన్నుతమునిధామా – సుగుణోపేతుడైన సకల నరసింహులు శ్రేష్ఠిగారిని దీవించ దిగిరావయ్యా! ●


రాబడిని పెంచే లక్ష్మీ స్వరూపమైన
ధర రూ. 400/- మాత్రమే
లక్ష్మి గవ్వలు
Lakshmi Gavvalu



లక్ష్మీ గవ్వలు లక్ష్మీ స్వరూపం. ఇందులో లక్ష్మీదేవి నివాసమై ఉంటుందని పురాణాలు ఉద్ఘాటిస్తున్నాయి. ఓ తెల్లని వస్త్రానికి పసుపు పూసి అందులో ఈ లక్ష్మీ గవ్వలను మూటగట్టి ఇంట్లో పెట్టుకుని పూజిస్తే కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగి ఒకరికొకరు సహాయ సహకారాన్ని అందించుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుతారు. రాబడి పెరుగుతుంది. అనారోగ్యం తొలగుతుంది. వ్యాపార స్థలంలో పెట్టుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. పనివాళ్ళు నుండి మీకు ఎటువంటి ఒత్తిళ్ళుండవు. మీరు కోరిన విధంగా మీపై గౌరవ మర్యాదలతో పనిచేస్తారు. ఉద్యోగస్తులు జేబులో పెట్టుకుంటే తోటి ఉద్యోగస్తులనుండి సమస్యలు రావు. ఈ గవ్వలను తాకి ఏ పని మొదలెట్టినా అది విజయవంతమౌతుంది.

రా.మల్లంపల్లి రామలింగ శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

Estd. 1975 PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM BAKTHITODAY

: 09840259871, 04424837505

BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra


## ఊరక మహిళా దినోత్సవములు కన్న ఊరించు భరత నారీ చరిత్రములెరుగండి!

**సకల నారీలో సంస్తుతయ యానమౌ**
**శ్రీ సరోజిని గన్నోశిష్ట చరిత**
**వివిధ ఖండాలలో విఖ్యాతిగాంచిన**
**విజయలక్ష్మినిగన్న వీరచరిత!**
**అజాతవీరుల గూడి యాలంబు నేసిన**
**లక్ష్మీ యోధనుగన్న లలిత చరిత!**
**స్త్రీ జనోద్ధరణకై సేవావ్రతాసక్త**
**మాపార్వతిని గన్న మహిత చరిత!**
**హంసమెహతా, సుచేతయ, నమృతకౌరు**
**కమల యరుణాది వనితలగన్న తల్లి**
**కరుణగల తల్లి మా పాలి కల్పవల్లి**
**అమ్మ భారతీ వందనమమ్మ నీకు –**

– ఇలాటి మహిళా మాన్యులను కన్న తల్లి భారతి – యంటూ కనుపర్తి వరలక్ష్మమ్మగారు 'భారతమాత వందనం' అను పద్యగుచ్ఛాన్ని రచించారు. అప్పటికింకా ఆంధ్ర మహిళా తేజమును భారతదేశమంతటా పాదుగొల్పిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ 'దుర్గాబాయమ్మ' వారి దృష్టికి రాలేదో – ఇతర పద్యములందుటకించారో తెలియదు. పురాణ ఇతిహాసాలందు పేర్కొన్న సీతా, సావిత్రి, ద్రౌపది వంటి వారలే కాదు, స్వరాజ్య సమరంలో తమ అసువులను తృణప్రాయంగా ఆర్పించిన మహిళలు, సాహిత్యంలో, శౌర్యంలో, రాజ్యపాలనంలో చురకత్తెల్లా విజృంభించిన మహిళలకు చిరునామా భారతదేశం.

దేశ భవిష్యత్తు మీ భుజస్కంధాలపై ఉంది. యువతరాన్ని మీరే తీర్చిదిద్దగలరు! ఇదే మన దేశ మహిళా దినోత్సవ ధ్యేయం కావాలి. మహిళలే భారతదేశ భవిష్యద్భారతమాతలు కావాలి! ●

(10వ పేజీ తరువాయి) చూసాను. ఎంత కలిమిడిగా కనిపించారు. గురుభక్తి, ఆధ్యాత్మిక చింతన వారికుందని గ్రహించాను. మిమిక్రీ + నటన + రచనం + దర్శకత్వం + పత్రికలు + ఆధ్యాత్మిక చింతనం – ఆరు రంగాల్లో ఆరితేరిన ఐదున్నర అడుగుల రావికొండలరావు ఐదున్నర దశాబ్దాలు కొనసాగడం సామాన్య విషయం కాదు.

ఆ యిరువురూ విజయనగరం వారే! విజయనగరం గర్వించదగిన కళాకారులే! విజయనగరం 'టూ' చెన్నయ్ 'టూ' హైదరాబాదులో వారు నటసతీపతులుగా వొడిదుడకులెరుగని జీవితం కొనసాగించడం – నేను కనపడినప్పుడు ఆత్మీయంగా, ఆదరంగా పలుకరించిన సమయాలు చిరు చిన్మయానందిత జ్ఞాపకాలు!

రాధాకుమారి పోయినవార్త విని ఓ తోబుట్టువును కోల్పోయిన బాధపడ్డాను. చిరునగవులే వారి వదనాల్లో చూసాను. ఖంగు ఖంగుమని కంచు మ్రోగినట్లు వాళ్ళిరివురి కంఠాలూ ధ్వనించేవి. ఇరువురూ సినిమా, టి.వి. నాటక రంగాల్లో బిజీగా ఉండేవారు.


ఓ సినిమాలో అక్కినేని గారితో అనుకుంటా – కోపిష్ఠి బడిపంతులుగా కొండలరావు నటించారు. మరో చిత్రంలో మతిమరుపు డాక్టరుగా నటించారు. స్టేజిపై, సినిమాల్లో కూడా వెధవాయ్ అని బెత్తం పట్టుకుని వస్తున్నప్పుడు హుందాతనం, హాస్యరసములు రెండూ పనిగట్టుకుని ఆరోగ్యవంతమైన నవ్వు పుట్టించాయ్.

ఎంతో విచారంగా ఉన్నవారు సహితమూ రావికొండలరావు గారి హాస నటనం చూచి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బులయ్యామని చెప్పేవారు.

ఇటీవల ఆయన మది పొదిగింపచేసిన పాత నటీనటుల్ను గురించిన వ్యాసాలు పత్రికల్లో వస్తూ – ఇందరు మహానటీనటుల చివరి జీవితం – ఇలా అంతరించిందా అన్న ఆవేదనకు గురియవుతున్నాం. రావికొండలరావు పదికాలాలపాటు రచయితగా, నటునిగా, చెలువొందాలనీ, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో జీవించాలని వేంకటేశ్వరుని ప్రార్థిస్తున్నా. ●

# జిల్లెలమూడి అమ్మ తత్వ దర్శనం!





**'అమ్మ' అనుభూతులనెన్నో ఆకళింపు చేసుకుని అమ్మతత్వ దర్శనమే దర్శింప జేసిన కొండముది బాలగోపాల కృష్ణమూర్తి ('విశ్వజనని' స్థాపక సభ్యుడు)**

**ఆ 'అమ్మ' వండగలదు, వడ్డించగలదు. వేవురు వచ్చినా కడుపు నిండుగ భుజింపచేయగలదు. అక్కున చేర్చుకున్నట్లు 'అమ్మ' వాత్సల్యమందించ గల ముగురమ్మల అమ్మ, ముక్కోటి ఇలవేల్పుల 'అమ్మ'.**

అమ్మ పొట్ట చూస్తుందీ, భార్య జేబు చూస్తుందనే సామెత జనుల్లో ఉంది. అయితే 'అమ్మ' తన కన్నబిడ్డలనే అలా చూస్తుంది. అందరి బిడ్డలనీ తన బిడ్డలుగా చూచే 'అమ్మ' ఒకరున్నారు. బిడ్డలు (వాళ్ళల్లో పెద్దలు కూడా ఉన్నారు సుమండీ) ఎవరి బిడ్డలైనా నేను కని వారికి పెంపకం యిచ్చానంటూండే అమ్మ – తరతమాలు, కులమత భేదాలెరుగని కులీన కుటుంబీకమైన 'అమ్మ' ఉంది. ఆ అమ్మ జిల్లెలమూడి అమ్మ. ఆమె యిల్లు అందరిల్లు. ఆ యింటి పొయిలో అగ్నిహోత్రం వెలుగుతూనే ఉంటుంది, పొయిమీద గుండెగలో ఎసరు కాగుతూనే ఉంటుంది. ఎవరు తన్ను దర్శించినా, 'ముందు నువ్వు వంటసాలలోకి వెళ్ళి అన్నం తిని రారా' అనేది.

కొన్నాళ్ళు ఆ 'అమ్మే' పొయ్యిమీద ఎసరు వేసి, ఉడికిన అన్నాన్ని తానే పళ్ళెములో పెట్టుకుని, తన గర్భవాసులకు పెట్టినట్లుగా, కడుపు నిండా కమ్మని భోజనం వడ్డిస్తూ, తిను, కడుపు నిండా తిను అనినా – 'అమ్మ' ఆంధ్రదేశంలోని అన్నపూర్ణమ్మగా జిల్లెలమూడిలో వెలిసింది, సజీవంగా ఐదు దశాబ్దాలున్నప్పటికినీ, ఏ ప్రచారమునూ చేయించు కోలేదు. సూర్యకాంతికి అడ్డుకట్ట వేయలేమన్నట్టు – ఆ అనసూయమ్మ కీర్తి అఖిల జగానికీ ఎరుకయింది.

మేడలూ, మిద్దెలూ, భవనాలూ, వనరులున్న అమ్మగాదు, ఓ గ్రామ కరణంగారి భార్య! కాశీలో విశ్వనాథునికీ, వ్యాస, వ్యాస శిష్యులకు అన్నం పెట్టిన అన్నపూర్ణమ్మ వంటి అమ్మ. ఆ 'అమ్మ' మహిమలిన్నీ యన్నీ కావు. రాజరాజేశ్వరి అవతారంగా భక్తులందరూ ఆమెను పూజించారు. ఆ 'అమ్మ' 50వ పుట్టిన రోజునాడు పాకలు, పందెళ్ళు వేసి లక్షన్నరమందికి భోజనాలు పెట్టిన సందర్భంలో అబ్బో – నాకెందరు బిడ్డలున్నారో! అందరూ కడుపునిండా భోజనం చేశార్రా అంటూ ప్రతీ పంక్తికీ వెళ్ళి తెలుసుకుని అమితానందం చెందిన అమ్మ, అష్టాదివర్ణాలూ భుజించి, 'అమ్మ' నామం భజించారు. 'అమ్మ'ను గూర్చి సంపూర్ణంగా తెలుసుకోవడం, అవగాహనం చేసుకోవడం అందరికీ సాధ్యం కాదు. అమ్మ చాటు బిడ్డగా, అవ్యాజమైన ప్రేమాభిమానాలు కలవానిగా, అమ్మ అంకితబిడ్డగా, అనుయాయునిగా, ఆరాధకునిగా అనుక్షణం కనిపెట్టుకుని ఉన్న బిడ్డ – కొండముది బాలగోపాలకృష్ణమూర్తి (అందరూ 'గోపీ అన్నయ్య' అంటారు) 'అమ్మ' మాతృ మహత్వాన్ని ఎవరూ అర్థం చేసుకోనంతగా చేసుకుని 'అమ్మ అందించిన తత్వదర్శనం' అను గ్రంథాన్ని అష్టాదశాష్ట పుటల్లో స్థూలంగానూ, ఘనాతి ఘన విషయాలను అతిసుస్సులభ సంగ్రహంగానూ విపులీకరించారు. గోపీ అన్నయ్య వ్రాసిన ఈ గ్రంథము పునర్ముద్రణం జరిగినట్లు విన్నాను గానీ – గ్రంథంలో యెక్కడా ఆ విషయం ముద్రించినట్లు లేదు.

ముందుగా చెప్పవలసిన మాటను వెనుకగా చెప్పడం నాకలవాటు – కొండముది సోదరులు కొండముది రామకృష్ణ, కొండముది బాలగోపాలకృష్ణమూర్తి లిరువురూ అమ్మ రెండు కళ్ళకూ ఉన్న రెండు రెప్పలవంటివారు. రెప్పపాటు సమయాన్ని కూడా అమ్మ నెడబాసిలేరు. తిరుపతి వేంకట కవుల్లో తిరుపతి శాస్త్రిగారు లేకపోయినట్లు కొండముది రామకృష్ణగార్ని అమ్మ తనలో ఐక్యం చేసుకున్నది.

కొండముది బాల గోపాలకృష్ణ మూర్తిగారు 'అమ్మ' ఉండగానూ, అమ్మ ఐక్యం చెందిన తరువాతనూ గ్రహించినది గ్రహించినట్లుగానే 'అమ్మ' గూర్చి అందించిన తత్త్వదర్శనమే గ్రంథంలో దర్శింపచేయడం, అమ్మ భక్తుల్లో చెరగని ముద్ర వేసుకుంటుంది.

'అమ్మ – నాన్నగారు – అమ్మ పుత్రిక హైమ' కలిసి ఉన్నప్పుడూ, హైమ అనన్తరమే నాన్నగారు అమ్మలో ఐక్యమైన తరువాతనూ, అమ్మ సిద్ధి పొందిన తరువాతనూ కలిగిన అనుభూతులూ, కనుగొన్న సత్యాలూ కృష్ణభగవానుని 'భగవద్గీత'కూ బ్రహ్మీభూతులు ప్రకాశానందగిరి స్వాముల వారి వ్యాఖ్య సారాంశ గ్రంథం 'గీతామకరందం'లా మనసుకు హత్తుకునిపోతుంది. గోపాలన్నయ్య 'అమ్మతత్వ దర్శనం'లో ముఖ్యంగా నన్ను హత్తుకున్న వ్యాఖ్యతత్త్వం ఉన్నది.

ఆత్మవ్యక్తంగానిది, అవ్యక్తత – పోతనామాత్యుడు నుడివినట్లు 'పెంజీకటి ఆవల నున్న ఏకాకృతి' అది ఏది? ఎట్లా ఉంటుంది? పెంజీకటి ఉంటే దానికి ఆధారమైన వెలుగు కూడా ఉంటుంది. చీకటికి ఆధారం వెలుగు" అన్నారు అమ్మ. పెంజీకటి అంటే మిరుమిట్లు గొలిపే వెలుగును చూచినప్పుడు కూడా చీకటి క్రమ్ముతుంది. కానీ ఆత్మను చీకటియన్నా వెలుగు అన్నా – ఆత్మ అవ్యక్తమైనట్లే ఆత్మవ్యక్తము కానిది. కాబట్టి ఆత్మ చీకటి కాదు వెలుగుకాదు, ఆత్మ సర్వవ్యాప్తి గనుక సర్వవ్యాప్తమైనది, పూర్ణమైనది. పూర్ణము అనగా శూన్యము కానిది. అంతా నిండియున్నది. విశ్వరూప సందర్శనమనే నా స్వీయ అనుభవాన్ని పురస్కరించుకుని అమ్మ తన పరిమితమైన రూపాన్ని అపరిమితంగా వ్యాప్తి చెందించి అపరిమిత తత్త్వాన్ని నాకు చూపిన దివ్యదర్శనం ఆధారంగా నాకు అనిపిస్తుంది అది పూర్ణమని అది 'నేనే'నని 32వ ఆత్మానుభవం–అనే 34వ పేజీలో గోపీ అన్నయ్య వ్యక్తపరిచారు.

(తరువాయి 13వ పేజీలో)

(12వ పేజీ తరువాయి) ఒక్కటే అనేకమైంది. ఆ ఒక్కటి నేనే! ఈ నేను అనేకనేనులుగా భాసిస్తూ, అనేక నేనులుగా జన్మిస్తుంది. 'జన్మకు కారణం అకారణం' అంటే నేనే నానుండి అనేక నేనులుగా లీనమవుతాను – అని అర్థం. అంటే జన్మనిస్తున్న దెవరు నేనే, నేను అనగా బ్రహ్మ, ఆత్మ. ఈ ఆత్మే అనేక జీవులుగా భాసించి మరల ఆత్మలోనే లీనమవుతుంది. ఈ జీవాత్మగా జీవించడానికి కాలనిర్ణయం చేసుకుని జన్మిస్తుందా? లేక జన్మనిస్తుందా? అనేది మీమాంస. ఆత్మజన్మనివ్వడమంటే ఇంకొకటి ఉండి తీరాలి. ఉన్నది ఒక్కటే! రెండు లేవు. పుట్టినప్పుడు గిట్టక మానదు, మరి జన్మకు మరణమున్నదా? మరణం అంటే పరిణామమే! పంచభూత మిళితమైన దేహం పంచభూతాలలోనే మరల కలుస్తుంది. కనుక నాశనము లేదు, పరిణామమే!

వేదశాస్త్రాలూ, వేదాంతుల శాస్త్రాలూ 'ఉన్నది ఒక్కటే మనసా! వేరొకటున్నదని తలుపకే మనసా' అన్నారు రమణమహర్షి.

ఇక్కడ గోపాలన్నయ్య వ్యాఖ్యానించేది. 'ఇది ఒక కాలచక్రం. ఈ కాలచక్రము కాలస్వరూపుడనైన నాకే కానీ జీవికి కాదని నాకు తెలుస్తున్నది. ఈ శరీరము మరణానన్తరమ్ శరీరమును ఆలంబనముగా చేసుకున్న జీవాత్మ పరమాత్మలో చేరవలసిందే! ఈ శరీరము ఉన్నంతకాలము చేయించిన పనులు (కర్మలు)కు కారణం ప్రేరణ కర్మ కాదు. ఈ జన్మలు రావడం పోవడమన్నది జీవుడి చేతులలో లేవు. వాడు (పరమాత్ముడు) యిస్తే తప్ప (అంటే యివ్వాలి) చేతులు వాడివి కాబట్టి ఆ చేతలూవాడివే – నని భ్రమపడుతున్నారు.

ఈ సర్వసృష్టి నేనే! విశ్వములోని సర్వజీవులూ, సకల చరాచరాలు 'నా'నుంచే ఉద్భవించి నాలోనే లీనమవుతాయి. అంతా నేనే! ఇదంతా నేనే! – నన్న భగవత్ తత్త్వం అమ్మలో దర్శించినట్టు గోపాలన్నయ్య – 52 వ్యాసాలలోనూ తన నమ్మకాన్ని తెలియచేశారు – తెలియచేస్తూనే ఆఖరి ముగింపు 52 వ్యాసం బ్రహ్మసత్యం – జగత్మిధ్య జగత్ సత్యం, బ్రహ్మ మిధ్య' – అని 'అమ్మ' అన్న మాటను దిగువ అప్పారావు గారు సంభాషణాసంశయాన్ని – 'అమ్మ' చేసిన నివృత్తినిందు పొందు పరుస్తున్నాను.

అమ్మా! అంతా అదే అంటున్నావు కదా! అలా అనుకోవటమా? అనిపించటమా?

అమ్మ... అనిపిస్తుంది నాన్నా! ముందు అనుకో తరువాత అనిపిస్తుంది– అని పూరుకోకుండా వసుంధర అక్కయ్యతో ఒక బంగారు గాజు తెప్పించి – ఇది ఏమిటి, నాన్నా' అని ప్రశ్నిస్తుంది.

'గాజు.'

గాజు కాదు, బంగారం కదా?

'ఔను'

బంగారం కాదు – మట్టి కదా?

'ఔను'

మట్టి కూడా కదా – 'అదే' అని నాకు అనిపిస్తున్నది అమ్మ –

ఈ సంభాషణ వలన మనది వస్తు దృష్టి – అమ్మది తత్త్వ దృష్టి.

'సర్వం ఖల్విదం బ్రహ్మ' 'అమ్మ' వినా జగత్ లేదు, ఆ లలితా రాజరాజేశ్వరీ దేవియే అనసూయా దేవి 'అమ్మ'గా జీవించి 'అమ్మ' వాత్సల్యానురాగం మనందరిపై చూపింది. అందుకే మీరెవ్వరూ నాకు భక్తులు కారు, బిడ్డలు. మీ బిడ్డలూ నా బిడ్డలే! వారి బిడ్డలూ నా బిడ్డలేననే వాత్సల్యం చూపిన 'అమ్మ'. అమ్మవంటి 'అమ్మ' లభిస్తుందా? నిజంగా ఆ 'అమ్మ' మనతోనే ఉంది. అందుకే 'రూపం పరిమితం – శక్తి అనంతం' అన్నది. అగోచరాన్ని గోచరింపచేసింది, అజ్ఞానరూపును చెరిపేసింది. అకారానికి పరాకాష్ఠ నిరాకారం. – అన్న అమ్మను ఆరాధిస్తూ అమ్మ అనుభూతుల్నే తలచుకుంటూ –తనకేది చూచినా ఏది తాకినా, ఏది విన్నా అది తప్ప ఏఁవీ కనిపించడం లేదు నాన్నా' అమ్మ అన్నట్లు – గోపాలన్నయ్య జీవితం కూడా అమ్మ తపస్సు, తపనంతోనే కొనసాగుతున్నందున జిల్లెలమూడిలో ఆయన్ను జూచినప్పుడు – ఆయనకు 83 ఏండ్లా – 38 ఏళ్ళవాడుగా కనిపిస్తున్నాడే – నాకన్నా ఓ రెండేళ్ళు పెద్దయినా కర్రపట్టలేదేఁవిటీ – అనుకున్నా! ఆయన్ను చూచి నాలుగున్నర దశాబ్దాలయింది. కానీ ఆయనే నన్ను గుర్తుపట్టారు, గాత్ర పరిపుష్టీ, నేత్రదృష్టి పరిపుష్టీ ఉన్నది. రోమరోమమూ రామమయమన్న కబీర్‌లా – ఆయన ఆజానుబాహు శరీరంలోని కణకణమూ 'అమ్మ' స్మరణం చేస్తూన్నందువల్లనేమో – ఆ ధృఢత్వమూ, యశస్సుకు ప్రాకులాడని మనస్సూ'.

'అమ్మ' అనుగ్రహం అపురూపంగా పొందిన బాలకృష్ణమూర్తి కొండముది బాలగోపాలకృష్ణమూర్తి. కొండముది బాలగోపాలకృష్ణమూర్తికి వందనశతములు తెలియచేస్తూ

అమ్మ తత్వ దర్శనమే మాధుర్యాన్ని పొందుతూ – ప్రముఖాంధ్ర పాఠక మహాశయుల్ని పొందమని అభినందిస్తున్నాను. స్వస్తి. ●


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :


# శ్రీ మన్మథ ఉగాది



1. మేలు చేయాలని
చేలు పండాలి
ప్రకృతి పులకరింపచేయాలని
రైతులు కష్టించాలి

2. లేలేత మావిచివురులేయాలని
గొంతెత్తి కోయిలలు కూయాలి
కమ్మని స్వరం ఆలపింపగా
ఝుంఝూ మారుతం వీయాలి

3. సౌశీల్య సంపద అలవర్చుకునేలా
సర్వమత సామరస్యం వెల్లివిరియాలి
మమతానురాగాలు కురిపించేలా
శ్రీ మన్మథ నామ సంవత్సరం వరలాలి

4. ఈ మన్మథ నామ సంవత్సరంలో
కులకుత్సితాలు పారిపోవాలి
ప్రతి ఒక్క రైతు కష్టపడి
స్వేదం కార్చి సేద్యం చేయాలి!

5. అవినీతి ఐస్‌గడ్డలా కరగిపోవాలి
నింగి చంద్రుడి నీతి చంద్రుడై వెలగాలి
కష్టాలన్నీ కనుమరుగవ్వాలి
కన్నీళ్ళు కాలప్రవాహంలో కొట్టుకుపోవాలి

6. నేతన్నల రైతన్నల ఇక్కట్లు తీరాలి
భవిష్యత్తు బంగారు బాటలు పడాలి!
మానవతా భావాలు మన్మథా బాణములు కావాలి
మా అమ్మ వండాలి! మా కడుపులు నిండాలి!

– **మేడిచర్ల సూర్యప్రకాశరావు**, రామరాజులంక